

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - 22 -

మా హాస్పిటల్ కు దగ్గరలో ఒక కంపెనీ ఉంది. అక్కడ పనిచేసే వారికి, ఉద్యోగం చేరబోయే ముందు, ఆ తర్వాత ప్రతి సంవత్సరం ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు చేయిస్తారు.

అలా రొటీన్ పరీక్షల కోసం, ఆ కంపెనీ లో పనిచేసే ఒకమ్మాయి వచ్చింది.

ఆమె చెప్పిన కథ!

❦❦❦

ఆ ఇంటికొచ్చి మూడు నెలలవుతోంది.

పెళ్లి అయి నాలుగు నెలలు.

ఇంటికి వచ్చిన కొత్తలో , ఆమె ఇంటిముందు వేసిన బంతినారు పెరిగి పూలు పూస్తున్నాయి.

భార్యని తీసుకుని రమ్మని అతను కబురేం చెయ్యకపోయినా, అమ్మానాన్నలే తీసుకొచ్చి ఇతని ఇంట్లో వదిలివెళ్ళారు.

అనుకోకుండా అతిథులు ఇంటికొచ్చినందుకు అతను కాస్త విచిత్రంగానే చూశాడు.

"మీకు వంట కిబ్బంది అవుతుందనీ తీసుకొచ్చాము అల్లుడుగారూ" ఉన్న నలుగురిలోనూ, వినిపించేలా మాట్లాడగలిగిన ఆమె పెద్దమ్మ అంది.

పెళ్ళయిన తర్వాత, ఎక్కువ రోజులు పుట్టింట్లో ఉంటే చుట్టుపక్కల వారికీ, వారి వలన వీరికీ ఇబ్బందిగా ఉందని తీసుకొచ్చారు గానీ, నిజానికి అతనేం కబురు చెయ్యలేదు.

ఇబ్బంది ఎవరిదైనా, అతని ముందు నిల్చోవడం ఆమెకు ఇబ్బందిగానే ఉంది.

ఇల్లాలు ఇంటికొచ్చినందుకు అతనికేమంత సంతోషంగా ఉన్నట్టు లేదు. అత్తమావల్ని పలకరించలేదు.

ఆమె తండ్రే “బాగున్నారా బాబూ " అని అల్లుడిని పలకరిస్తే , మౌనంగా తలూపాడు.

‘అబ్బాయి ఎక్కువగా మాట్లాడడు కానీ బుద్ధిమంతుడు’ అని కూతురు వినేటట్టు సర్దుకున్నారు. ఇల్లూ వాకిలీ వదిలి వచ్చేశామనీ, త్వరగా వెళ్ళాలని కూడా అనుకున్నారు.

అతను తలిదండ్రులతో అసలు మాట్లాడకపోయే సరికి ఆమె కూడా, వాళ్లని ఉండమని అనలేకపోయింది.

❦❦❦

ఉదయాన్నే ఆఫీస్ కు వెళ్తాడు.  అదేం ఆఫీసో?

సాయంత్రం వస్తాడు. మళ్ళీ రెడీ అయి ఇంకెక్కడికో వెళ్తాడు. రాత్రి అతనొచ్చే టైముకు ఈమె నిద్రపోతూ ఉంటుంది.

అతను మెలకువతో ఉన్నపుడు తప్పించుకుని తిరుగుతూ ఉంటుంది. అతనికి దగ్గరగా వెళ్ళబుద్ధి కాదు.

ఆడవాళ్ళు తమంతట తాము మగవాళ్ళ దగ్గరకు వెళ్ళడం దగ్గరకు బాగోదుకదా అనుకునేది.

అతనికోసం అన్నీ చక్కగా అమర్చాలనుకుని ఉదయాన్నే లేచి ఇల్లు శుభ్రం చేసేది. తను కూడా చక్కగా రెడీ అయేది. ఆమె వంక చూసే ఆసక్తి ఉన్నట్టే లేదు అతనికి .

అతనేం చదువుకున్నాడు?

ఎక్కడ చదువుకున్నాడు?

చిన్నప్పటి విషయాలేమిటి?

ఏం పని చేస్తాడు? –  పెళ్ళి కుదిర్చిన జగన్నాథం గారికి తెలుసు. మంచి ఉద్యోగమని చెప్పారాయన.

పెళ్ళికి ఆఫీసు వాళ్ళెవరూ వచ్చినట్టు లేరు.

తనని ఆఫీసుకు తీసుకెళ్తాడా?

పోనీ ఆఫీసు వాళ్లనే ఇంటికి పిలుస్తాడా?

సినిమాల్లో అలా జరుగుతూ ఉంటుంది కదా.

వాళ్లొస్తే, ఏం తయారు చెయ్యాలి?

ఏం మాట్లాడాలీ?

ఏమీ తెలియవు. అడగాలంటే భయం.

అవేమీ అడక్కూడదన్న విషయమొక్కటే తెలుసు.

ఆ ఇంట్లో ఆ ఆలోచనలే ఆమెకు తోడు.

పగలంతా మాలతి చందూర్ వంటల పుస్తకం చదువుకుంటూ రేపటికి ఏం చెయ్యాలి , ఎలా చెయ్యాలీ అన్న ఆలోచనలతో గడిపేది.

ఆదివారం నాడు ఇంట్లో ఉంటాడని ఎన్నో చేసింది. అవేమీ అతను ముట్టుకోలేదు.

మర్నాడు ఉదయాన్నే ఇంటి దగ్గరకొచ్చిన కూరలు బాలేదని మార్కెట్ కు వెళ్ళింది. బెండకాయలు చివళ్ళు తుంచేస్తుంటే, షాపతను కోప్పడ్డాడు.

అలా వద్దన్నాడు.

“మరి ముదురుకాయలు కూరకు వాడను కదా.” బెండకాయలు వద్దంది.

“సరే , తుంచుకో” అన్నాడు.

తను చక్కగా తయారయేది.

వంట చక్కగా చేసేది.

ఇల్లు చక్కగా ఉంచేది.

ఇల్లు సర్దుతోన్నపుడు ఓ అనుమానమొచ్చింది. ఈ ఇల్లు తనదేనా అన్న అనుమానం.

అతనిది వేరే లోకం. ఆ లోకంలో ఈమెకు ప్రవేశం ఉన్నదో లేదో? ఆమెకే అనుమానం.

ఆ నాడు సాయంత్రం , గులాబి రంగు ఎంబ్రాయిడరీ పూలు కుట్టిన గోధుమ రంగు కాటన్ చీర కట్టుకుంది.

పట్టు అంచున్న గళ్ళ బ్లౌజ్ వేసుకుంది. అద్దంలో చూస్తే , అంచుపక్కన ఉన్న చర్మం బంగారం లా మెరుస్తోంది. గమనిస్తాడా?

వత్తుగా ఉన్న జుట్టు అల్లుకుని చక్కటి జడవేసుకుంది. వరండాలో స్థంభానికానుకుని నిలబడింది.

ఇవాళ తప్పకుండా తనని చూస్తాడు. కనీసం కళ్ళతోనైనా మెచ్చుకుంటాడు.

చల్లగాలి ఆమె బుగ్గలకు తగిలి ఎరుపెక్కించింది. గాలికి జుట్టు వచ్చి ముఖాన్ని తాకుతోంది.

సాయంత్రం అవుతోంది.

గేటు చప్పుడయ్యింది.

పై పోర్షన్ అద్దెకిచ్చాడు. అందులో ఒక పెద్ద వయసు జంట ఉండే వారు. వాళ్ళ పిల్లలు ఎక్కడో దూరంగా సెటిల్ అయ్యారు.

రోడ్డుకవతలిపక్కన ఫాన్సీ షాపు నడుపుతుంటాడాయన. ఆయన నిద్రపోతున్నపుడు ఆవిడ, ఆవిడ పనిలో ఉన్నపుడు ఆయన, అలా భార్యా భర్తలిద్దరూ షాపులో కూర్చుంటుంటారు. రోజంతా ఇంటికీ , షాపుకీ మధ్య తిరుగుతుంటారు.

భార్య బయటి నుండి వస్తోంది.

మెట్లెక్కబోతూ ఈమెను చూసి ఆగింది.

“ఎలా ఉన్నావో తెలుసా?”

"ఏమిటాంటీ?" వరండా దిగి ఆమె దగ్గరకొచ్చింది.

ఆశ్చర్యాన్ని పదాల్లో మార్చడం ఆవిడకు తెలియలేదు.

“ఏమీ లేదు, ఏమీ లేదు”

పైకి వెళ్తూ, తిరిగి తిరిగి ఈమెనే చూస్తూ మెట్లెక్కుతోంది.

కాసేపటికి, ఆవిడే మళ్ళీ వచ్చింది.

"ఇందాక చెప్పడానికి కుదరలేదు. గుడిలో బొమ్మలుంటారే అలా ఉన్నావు." అంది.

సన్నజాజులకు అక్కడక్కడా కనకాంబరాలు వేసి మాల కట్టి తెచ్చింది. అబ్బాయి వచ్చాక పెట్టుకోమంది. ఆమెదగ్గర పూలు అందుకుని అలాగేనని స్టీల్ గిన్నెలో పెట్టుకుని నీళ్ళు చల్లింది.

తలలో పూలు పెట్టమని అతన్ని అడిగితే?

‘అమ్మో , ఇంకేమైనా ఉందా?’ మనసు హెచ్చరించింది.

పదయ్యింది. పదకొండయ్యింది.

ఎప్పుడొస్తాడో. ఇంటి తాళం తన దగ్గరకూడా ఉంది. లోపలివైపునుండి లాక్ చేసి , సన్నజాజుల మాల వెంకటేశ్వరస్వామి పాదాల దగ్గర పెట్టి నిద్రపోయింది.

అర్ధ రాత్రి ఎప్పుడో అతనొచ్చిన అలికిడి వినిపించింది.

గదిలో అప్పటివరకూ ఉన్న సన్నజాజుల పరిమళం మాయమైంది.

అతను దగ్గరకొస్తాడా.

'దేవుడా, రాకుండా ఉంటే బాగుండు. రాకుండా ఉంటే బాగుండు.'

దేవుడు ప్రార్థన విన్నాడు.

గుండె దడ తగ్గింది. ఎప్పుడో నిద్రపోయింది.

అతను ఆఫీసుకు వెళ్ళే టైముకు రంగు రంగుల చీరలు కట్టుకునేది. తనవైపు చూస్తాడనుకుని ఆశగా చూస్తూ ఉండేది.

చూసినట్టే ఉండేవాడు. నచ్చిందనీ లేదు నచ్చలేదనీ లేదు.

ఒక రోజున ఇంద్ర ధనసు లాంటి చీర కట్టింది. ఆ రోజున మాత్రం ఆమె వైపు చూశాడు.

దగ్గరకు వస్తున్నాడు.

ఏదో అంటాడు.

మనసులో ఆమె నవ్వుకుంది.

ఆమె మనసు , లోపల నవ్వుకుంది.

"ఇలాంటి చీరలు ఎవరు కడతారో తెలుసా?" మెత్తగా అడిగి, ఆమెకు తెలియదని జవాబు కూడా చెప్పాడు.

మెత్తని కత్తి గుచ్చుకుంది. చుక్క కూడా చిందనంత అమరికగా గుచ్చుకుంది.

లోపలికి వెళ్లి చీర మార్చుకుంది. చీరని పెట్టె అడుగున దాచేసింది.

ముసురు పట్టిన మనసులో ఇంద్రధనుసు మాయమైంది.

బయటి గేటు నుండీ ఇంటివరకూ ఒక సిమెంట్ దారి ఉంది. దారి పక్కనే ఉన్న నల్ల మట్టిలో కనకాంబరాలు పెంచుతోంది. మధ్యాహ్నం పూల మొక్కల మధ్య పనిచేస్తుంటే , పక్కనే అడుగుల చప్పుడైంది.

ఎవరా అని చూసింది. పై పోర్షన్ లో ఉండే ఆయన మెట్లు దిగి , ఆమె పక్కగా నడిచి గేటు తీసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

షాపువైపు వెళ్ళేందుకు ఆయన రోడ్డు దాటుతున్నాడు. రోడ్డు మీద కార్లూ , వాహనాలూ పోతున్నాయి. హడావుడిగా ఉంది. ఆయన రోడ్డు దాటి షాపు వరకు వెళ్ళేంత వరకూ చూసి, మళ్ళీ మట్టి తవ్వుతోంది.

ఒక్క క్షణం ఆగాక అనుమానం వచ్చి తమ ఇంటివైపు చూసింది. వరండాలో నిలబడి తనవంకే చూస్తున్నాడు. కంగారొచ్చింది.

కొంప మునిగే పని జరిగిపోయినట్టు కళవళ పడింది.

చేస్తున్న పని పూర్తిచేసి లోపలికి వెళ్ళింది.

పక్కగా నడిచి వెళ్తుంటే ఆమె జడపట్టుకుని ఒక్క సారిగా లాగాడు.

"అబ్బా" నొప్పికి విలవిల్లాడింది.

"నచ్చాడా వాడు?"

వాడెవడో అర్థమయింది.

ఊరికే చూడడంలో పెద్దగా వచ్చేదేమీ ఉండదనీ, ఆనందం , ఇంకా ఎక్కువ ఆనందం పొందాలంటే ఏమేం చెయ్యవచ్చో నవ్వుతూ సలహా ఇచ్చాడు. ఆమెకు తన సహాయసహకారాలెప్పుడూ ఉంటాయన్నాడు.

కొంతమంది నవ్వరు.

నవ్వితే మటుకు, ప్రళయమే నయం.

ఆ రోజు ఆమెకు తయారవాలని అనిపించలేదు. చీకటిలో కూర్చుంది.

అమ్మాయ్ అంటూ పైన అద్దెకుండే ఆవిడ వచ్చింది.

“చీకట్లో కూర్చున్నావే?” అడిగింది.

“ఊరికే!” అన్నది.

“ఇవాళ మల్లెపూలు కోసుకోవడానికి రాలేదు నువ్వు. ఏదో పనిలో ఉండి మర్చిపోయావని నేనే కోసి మాలకట్టాను.” అంటూ ఎప్పటిలా తలలో పెట్టబోయింది.

"వద్దండీ" వెనక్కి తగ్గింది.

“ఓహో స్నానం చెయ్యలేదా ఇంకా?” అంటూ పూలు వేంకటేశ్వరస్వామి పటం ముందు పెట్టింది.

‘అమ్మయ్య’ ఊపిరితీసుకుంది.

రెండు మూడు రోజులు తప్పు చేసినట్టు, అతన్ని తప్పించుకుని తిరిగింది. కాఫీ ఇవ్వడానికి కూడా ఎదురు పడలేదు.

కాఫీ ఏదని అతను అడగనూ లేదు.

ఆ మూడు రోజుల్లోనే అర్థమైంది అతనసలు ఆమె చేసిన వంట ఏదీ తినడం లేదన్న విషయం.

మధ్యాహ్నం చాప మీద పడుకుని నిద్రపోతోంది. బెడ్ రూం లోకి ఎప్పుడో కానీ వెళ్ళదు. వెళ్లినా, అది శుభ్రం చెయ్యడానికే. ఆ గదితోకానీ, అక్కడి వస్తువులతో గానీ పరిచయం ఉన్నట్టే ఉండదు. తొందర తొందరగా బయటికి రావాలనిపిస్తుంది.

టీవీ ముందు చాపవేసుకుని దిండు మీద వేసుకుని ఏదో చూస్తుంటే నిద్రపట్టింది.

అతనెప్పుడు వచ్చాడో, టీవీ గోలలో వినిపించలేదు.

ఎవరో తడుతుంటే కళ్ళిప్పి చూసింది. అతనే భుజం మీద తట్టి నిద్రలేపుతున్నాడు...కాలితో.

లేచి కూర్చుంది.

“కాలితోనా లేపేది?” ఇంకా నిద్రమత్తులో ఉండడం వల్లనేమో, ధైర్యంగానే అంది.

“కాలికీ చేతికీ తేడా ఏమిటి?”

మాట్లాడకుండా కూర్చుంది.

"ఏమీ అనుకోకపోతే నీతో ఒక విషయం చెప్పనా?" చాలా సౌమ్యంగా అన్నాడు.

అంత చక్కగా అతనెప్పుడూ మాట్లాడిందే లేదు. మనసులో కోపమంతా మర్చిపోయింది.

"చెప్పండి."

"పగలు నిద్ర దరిద్రం. మా ఇంటికది పట్టించవద్దు"

ఓ సారి బాబాయి వరసైన చుట్టం వచ్చాడు. తమ ఇంట్లో చెప్పకూడదన్న షరతుతో అతనితో విషయం చెప్పింది.

కొత్తగా ఉద్యోగంలో చేరిన మాష్టారు అల్లరి చేసే సీనియర్ పిల్లల క్లాసుకెళ్ళి పాఠం చెప్పినట్టు, ఏం చెప్తోందో తనకే అర్థం కానంత హడావుడిగా చెప్పింది.

ఎక్కడ మొదలు పెట్టాలో, ఎలా చెప్పాలో ఆమెకు తికమకగా అనిపించింది. అతనసలు మాట్లాడడు. చూడడు. పట్టించుకోడు. నా ఇల్లు కాదిది. అతను పట్టించుకోడు. ఏం చెయ్యాలని అడిగింది.

బాబాయి ఏదో పనిమీద పట్నం వచ్చాడు పనితొందరలో ఉన్నాడు కానీ పంచాయితీ చేసే ఉద్దేశం లేదు. ఆడవాళ్ళకు ప్రతివిషయంలోనూ ఏవో ఫిర్యాదులుంటాయనుకుని "ఎక్కువమంది మగవాళ్ళు ఇలానే ఉంటారు. సర్దుకుపోవాలన్నాడు."

"అందరిళ్ళలో ఏదో ఒక రామాయణం ఉంటుందే పిచ్చిదానా! మన పెద్దమ్మ వాళ్ళ పార్వతిని వాళ్ళాయన ఏం చేశాడో తెలుసా?"

వంటింట్లో మొదలై, ఐసియులో అంతమయిన కథ చెప్పాడు.

"వాళ్ళతో పోల్చుకుంటే నీదసలు కష్టమేనా?"

ఓర్పు లేకపోతే రోడ్డున పడతావన్నాడు.

నిజమే, ఓర్పుండాలి. మన కన్నా ఘోరమైన బతుకుల్ని తలుచుకుంటూ, మన అదృష్టానికి మనమే అసూయపడుతూ బతకాలిగానీ, ఏడవడమేమిటి?

"నన్ను తన మనిషి అని అనుకోడు బాబాయి" అని చెప్పలేకపోయింది.

ఆ మాట, ఆ భావం బాబాయికర్థం అవుతాయని అనిపించలేదు.

కానీ ఒకరితో జతపడాలని ఉంటుంది కదా. అది కొన్ని సార్లు తీరని కోరిక అవుతుంది.

తన జీవితం లో ఏదో తేడా ఉంది. అదేమిటో , ఆమెకేం కావాలో సరిగా తెలియనంత తెలియనితనం ఉంది.

ఓ రోజు మధ్యాహ్నమే ఇంటికొచ్చాడు. బయటికిపోలేదు. తాగుతూ కూర్చున్నాడు. మాట్లాడడు.

భోజనం చేస్తాడేమోనని కనుక్కుంది. చేతితో వద్దన్నాడు.

ఆమెకు ఇంట్లో తిరగడం ఇబ్బందిగా ఉంది. అతని ముందు ఎలా తిరుగుతుందీ? ఏమీ మాట్లాడడానికీ లేదు. వంటింటిలో కూర్చుంది.

కాసేపు వరండాలో కూర్చున్నాడు. లోపలికి వచ్చి సోఫాలో కూర్చుని

"ఇలా రా!" అని పిలిచాడు.

దగ్గరకు వెళ్ళింది.

సోఫాలో అతని పక్కన కూర్చోవడమే? నిలబడే ఉంది.

"నా ఉద్యోగం పోయింది."

'ఎందుకు?'

ఆఫీసులో అతనంటే చాలామందికి అసూయట. అతనిపై పగబట్టి ఆఫీసు డబ్బు తినేశానని కంప్లైట్ ఇచ్చారనీ, అందువల్ల ఉద్యోగం నుండి తీసేశారనీ చెప్పాడు.

చెప్తోన్న విషయం వినడం తప్ప అసలు నిజమేమిటో నిలదీసేంత చనువు లేదు.

"మరిప్పుడెట్లా?"

అతను ఏడవడం మొదలెట్టాడు. ఎప్పుడూ లేనంత కంగారొచ్చింది.

“మీరేడవద్దు.” అంది.

“ఏడవక ఏం చెయ్యమంటావు? అంతా అయిపోయింది. డబ్బు లేకపోతే ఎలా బతికేది.

రోజూ ఖరీదైన మందులేకపోతే బతకలేనన్నాడు. ఇంటికోసం చేసిన బాంక్ లోన్ ఇంకా తీరలేదన్నాడు. నాకెవ్వరూ లేరు” అని ఆపకుండా ఏడుస్తున్నాడు.

“నేనేం చెయ్యాలో చెప్పండి.” తను అలా మాట్లాడడం ఆమెకే ఆశ్చర్యంగా ఉంది. అతనికి సహాయం చేద్దామనుకున్నా, డబ్బూ లేదు. ఉద్యోగం చెయ్యడానికి ఇంటర్ కు మించి చదువూ లేదు. ఈ సంబంధం కుదిరినందుకు తండ్రి ఎంతో అప్పుచేసి పెళ్ళిచేశాడు. మళ్ళీ నాన్న దగ్గరకెళ్ళి ఏమైనా తెమ్మంటాడేమోనని భయపడింది.

“నువ్వు తప్ప నాకింకెవరూ లేరు” ఏడుస్తున్నాడు.

“ఏడవొద్దు.” అతని భుజం మీద చెయ్యి వేసి ఓదార్చుదామనుకుని ఆగింది. పరిచయం లేని మనిషినెలా ముట్టుకోవడం? .

కానీ, ఎప్పుడూ లేనిది అతను తనతో మాట్లాడడమే బాగుంది. ఏదో ఒకటి చెయ్యాలి. ఎలాగైనా ఈ స్నేహం నిలబడాలి. అంత కష్టం లోనూ తెలియని ఉత్సాహం లో వచ్చింది.

మర్నాడు ఆదివారం. మార్కెట్ కెళ్ళి కూరగాయలవైపు కాకుండా, ఆమెకు అలవాటు లేని వైపు వెళ్ళింది. ఆ పరిసరాల్లో నిల్చోవడం కూడా కష్టమే అయింది. ఆ వ్యాపారం చేసేవాళ్ళు రోజంతా అక్కడే ఎలా ఉంటారో?

మనసు వేసిన ప్రశ్నకు మనసే సమాధానం చెప్పింది.

‘అవసరం, అలవాటు ఉంటే ఏ పనీ కష్టం కాదు.’

వంటకు కావలసినవన్నీ తీసుకుంది. అమ్మమ్మ చేసినట్టు చేపల కూర వండాలి. అతనికి తప్పకుండా ఇష్టమవుతుంది.

అమ్మమ్మ ఎలా చేసేదో, మనసులోనే మననం చేసుకుంటూ నడుస్తూ ఉంది. చేతిలో సంచి బరువెక్కుతూ ఉంది. ఆలోచనల్లో పడి ఆటో ఎక్కడం మర్చిపోయింది. ఎండ వచ్చేసింది. చేతులు మార్చుకుంటూ ఇంటివైపు నడిచింది. దాహంగా ఉంది. లోపలికెళ్ళగానే మంచినీళ్ళు తాగాలనుకుంది.

లోపల చప్పుడు లేదు. నిద్రపోతున్నాడనుకుని , మెల్లగా, చప్పుడు కాకుండా తలుపు తీసింది.

ఎవరో ఒకామె అతని పక్కనే కూర్చుని ఉంది. అతను తలవంచి ఆమెకు మాత్రమే వినిపించే విషయాలేవో మాట్లాడుతున్నాడు. సిరారంగు నీలం సిల్క్ చీర కట్టుకుంది. చీరకు ఇస్త్రీలేదు.

ఆమె ఎవరో? వయసు చూస్తే అతనికన్నా పెద్దగా ఉంది.

ఈమెను చూశాక ఇద్దరూ దూరం జరిగారు.

అలా జరగడంలోనే అర్థమైంది, వారెంత దగ్గరో!

మనసులో కలుక్కుమంది. వంటింటి లోపలికి వెళ్ళిపోయింది. మంచి నీళ్ళు తాగాలన్న విషయం గుర్తు రాలేదు.

అతను వంటింటి గుమ్మం లోకొచ్చి, “మా దూరపు బంధువు.” అంటూ వరసేదో చెప్పాడు.

మనసు చెవులు మూసుకుంది.

గంట క్రితం ఉన్న ఉత్సాహం, ఎటో వెళ్ళి పోయింది. ఎక్కడలేని నీరసం కమ్ముకుంది.  గుండె నిండా అర్థం కాని అలజడి.

ఈ పెళ్ళేమిటో, ఆ మనిషెవరో, ఆ గోలేమిటో అనవసరంగా ఇక్కడ ఉన్నాననుకుంది. ఆ వాతావరణం లో అన్ని నెలలుండడమే ఎక్కువ అనుకుంది.

తన ఇంటికి వెళ్ళిపోవాలి.

తల్లిదండ్రులకు తనేం చెప్పాలి? ఇరుగుపొరుగువారికి వాళ్ళేం చెప్పాలి.

పెళ్ళికి చేసిన అప్పులింకా తీరనే లేదు.

తనేదో ఇక్కడ సంతోషంగా ఉంటున్నానన్న కలలో ఉంటున్నారక్కడ. ఆ కల చెదరగొడితే తనకొచ్చేదేమిటి?

తన చిక్కులు తనే విప్పుకోవాలి. ఎలాగైనా సరే, ఇక్కడే బతకాలి. ఇంటికి వెళ్ళకూడదు. అనుకుంది.

వంట పూర్తి చేసి వాళ్ళిద్దరికీ పెట్టింది. ఈమె చేసిన వంటను వచ్చినావిడ మెచ్చుకుంది. అతనెంతో అదృష్టవంతుడన్నది. ఈమె అంతకన్నా అదృష్టవంతురాలంది.

భోజనాలయ్యాక వచ్చిన కష్టం తీరే మార్గం చెప్తానని  ఆమెను కూర్చోబెట్టాడు. పక్కనే కూర్చున్నాడు.

వచ్చినావిడ చెప్పినట్టు వింటే చాలు, కష్టాలు తీరతాయని చెప్పాడు.

చెయ్యి మీద చెయ్యి వేశాడు. అతని చెయ్యి వేడిగా ఉంది. ఆమెను ఒప్పించడానికన్నట్టు, చేతి మీద రాస్తున్నాడు. ఆమె వదిలించుకోవాలని చూస్తున్న కొద్దీ బిగిస్తున్నాడు. ఆ చేతి స్పర్శకన్నా,  రాత్రులు అతనితో గడిపే ఈ మూడు నిముషాల నిశ్శబ్దం భరించడమే తేలిక అనిపించిందామెకు .

ఆమె సహాయం చెయ్యకపోతే ఇకతను చావక తప్పదన్నాడు. బెడ్ రూంలో ఫాన్ చూపించి దానికి వురేసుకుంటానన్నాడు. బెల్ట్ తెచ్చి మెడకు కట్టుకోబోయాడు.”

భుజం మీద చెయ్యి వేసి నొక్కుతూ బతిమాలుతున్నాడు. ఆ స్పర్శ భరిస్తున్న ఆమెకు, తనమీద తనకే అసహ్యం కలిగింది.

రోడ్డు మీద వెళ్తుంటే, ఎవరో పోకిరి తాకరాని చోట తాకినంత దుఃఖం కలిగింది. ఘోరమైన అవమానం  పొందిన దానిలా కళ్ళంట నీళ్ళు కారిపోయాయి.

“ఏడవకు. మనకు మంచిరోజులొస్తాయి.”

‘దేవుడా, ఎందుకు పుట్టించావు? ఇంత నమ్మకద్రోహం చేస్తావా?’ దేవుడితో వాదులాడింది. అతను దూరంగా కూర్చుంటే చాలు, ఇంక ఈ జీవితానికింకేమి వద్దు దేవుడా అనుకుంది.

వచ్చినావిడ చెప్పినట్టు వింటే చాలన్నాడు.

ఆమె ఏం చెప్తుంది?

తను ఏం వినాలి ? ఏం చెయ్యాలి?

"అలిసిపోయావు. ముందు స్నానం చేసి, చక్కటి చీర కట్టుకో"

ఎన్ని చక్కటి చీరలు కట్టింది? ఏదీ నచ్చలేదు. ఇప్పుడెక్కడినుండి తేవాలి చక్కటి చీరను.

ఆవిడ తెచ్చిన జిగి బిగి చీర కట్టుకుంది.  అలాంటి జిలుగు చీరలసలు తను కొన్నదే లేదు.

చీర గుచ్చుకుంటోంది.

అతను కూడా చూసి బాగున్నావన్నాడు. ఎంతో మెచ్చుకున్నాడు. బయటకు వెళ్తే అందరూ తనవంకే చూస్తారని హామీ ఇచ్చాడు.

భోజనం చెయ్యమన్నారు. ఆకలి లేదంది.

ఓపికుండాలికదా అని ఆవిడే ఏదో తాగించింది.

అందులో మందు, మత్తు రెండూ ఉన్నాయి.

కొన్నాళ్ళు గడిచాయి. అతని చుట్టమే ఆమెకు తోడుగా ఉండేది. జాగ్రత్తగా తీసుకెళ్ళేది. అంతే జాగ్రత్తగా ఇంటిదగ్గర దింపేది.

రాత్రి గాయాలకు మందు రాసేది. దయగా చూసేది.

అతను చెప్పినట్టు కష్టాలు తీరాయి. మంచిరోజులూ ఒచ్చాయి.

అతను చావాల్సిన అవసరమూ పోయింది.

చావడానికెంతో ధైర్యం కావాలి.

చావడమెలాగో తెలియక , ఆ ధైర్యం లేక, బతికేవారే ఎక్కువమంది.

డబ్బు కష్టాలు తీరాక, అతను హాయిగానే జీవిస్తున్నాడు.

ఆమె కూడా జీవంతోనే ఉంది.

ఆదివారం రాత్రి ఒక ఆఫీసర్ వచ్చాడు. ఈమెను గుర్తు పట్టాడు.

అతను గుర్తు చేశాక ఆమెకూ గుర్తొచ్చింది. చిన్నతనంలో రెండు కుటుంబాలూ పక్క పక్క పోర్షన్లలో ఉండేవి. ఒకే స్కూల్లో చదువుకున్నారు. అతను బాగా చదువుకునే వాడు. ఎప్పుడూ తల్లినంటిపెట్టుకునే ఉండేవాడు. తల్లితోనే కలిసి స్కూలుకొచ్చేవాడు.

ఎందుకిక్కడ ఉన్నావన్నాడు.

తన గురించి చెప్పు కోవడం, జాలిపుట్టించడం ఆమెకు ఇష్టం లేక, “డబ్బు అవసరమైంది.” అన్నది.

చిన్నప్పటి విషయాలు కొన్ని గుర్తు తెచ్చుకున్నారు. ఇంతవరకూ ఎలా వచ్చిందో అడిగాడు. ఆమెకు చెప్పడం ఇష్టం లేదని అతను రెట్టించలేదు.

“ఎంత నెమ్మదిగా ఉండేదానివి. ఎంత అమాయకంగా పెరిగావు. ఈ కష్టం ఏమిటి? ఉద్యోగం చేసుకోవచ్చుగా?”

తన ఇంటర్ చదువుకెవరిస్తారు ఉద్యోగం?

తనిప్పిస్తానన్నాడు.

కళ్ళు ఆశగా మెరిశాయి.

ఆఫీసులో చిన్న ఉద్యోగం. తను ఫోన్ చేసి చెప్తానన్నాడు.

“అటెండర్ లాంటి ఉద్యోగం. ఉద్యోగం చిన్నదే , శ్రమ ఎక్కువ. కంపెనీకి చెందిన హాస్టల్ లో ఉండొచ్చు. ఖాళీ సమయాల్లో చదువుకో. పరీక్షలు పాసయితే , ప్రమోషన్లు కూడా ఉంటాయి.” అన్నాడు.

కురిపించిన వరాల జల్లుకు బదులుగా ముత్యాలు జలజలా కురిశాయి.

తెల్లవారితే సోమవారం. ఆఫీసు అడ్రసు చెప్పాడు.

ఇంటిదగ్గర విడిచిపెడతానన్నాడు.

తెల్లవారాక వెళ్తానన్నది.

తలలో పూలు బరువుగా అనిపించి తీసేసింది.  ఎన్నో రోజుల నిద్ర ఒకేసారి కళ్ళమీదికొచ్చింది.

ఉదయాన్నే ఆమె వెళ్ళబోయే ముందు అతనికి కృతజ్ఞతలు చెప్పింది.

"ఇలాంటిచోట్లకు రావద్దూ" అంది.

నవ్వుతూ తలూపాడు.

ఇంటికొచ్చింది.

బట్టలు సర్దుకుంది.

అతనితో చెప్పాలా? వద్దా?

అతను బయటి రూం లో సోఫాలో కూర్చుని ఎదురుగా టీ పాయ్ మీద కాళ్ళు పెట్టుకుని టీవీ చూస్తున్నాడు. .  ఈ మధ్యన రంగు తేలాడు.

ఆమె పెట్టె పట్టుకుని రావడం చూసి లేచాడు.

"టూర్లు కూడా ఒప్పుకుంటున్నావా ఈ మధ్యన?"

మౌనంగా నిల్చుంది.

" సంసారం కోసం ఎవరూ చెయ్యని త్యాగం చేస్తున్నావు. దేవత లాంటి దానివి."

దగ్గరకు వచ్చాడు.

"బాధపడుతున్నావా? శీలం మనసుకే గానీ మనిషికి కాదు. నువ్వు నిప్పులాంటి దానివి. నేనున్నాను నీకు."

అంటూ భుజం మీద చెయ్యి వేశాడు. భుజం మీద పాము పడ్డట్టు విదిలించుకుంది.

"ఏమయిందే నీకు?"  అని ఒక పిలుపు జత చేశాడు. ఇప్పుడామె ఆ పిలుపుకు అర్హత సంపాదించుకున్న నమ్మకంతో .

అతని చెంప మీద బలంగా ఈడ్చి కొట్టింది.

ఊహించని దెబ్బకు పక్కనే ఉన్న టీవీ మీద పడ్డాడు.

బయటికి వచ్చి ఆటో ఎక్కింది. ఆటోలో ఎక్కిన తర్వాత చెయ్యి ఊదుకుంది. గుండెలో మంట తగ్గింది కానీ, చెయ్యి ఇంకా మండుతూనే ఇంది.

Post your comments